

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 09-12-2022 సంపుటి : 04 సంచిక :96 పేజీలు : 4 వెల : రూ 3-00


## రాష్ట్రానికి సైకో పాలన వద్దు .. సైకిల్ పాలన ముద్దు: చంద్రబాబు



పొన్నూరు: రాష్ట్రానికి సైకో పాలన వద్దు సైకిల్ పాలన ముద్దని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇవాళ గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో పర్యటించారు.నారాకోడూరులో జరిగిన బహిరంగసభలో చంద్రబాబు మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా వైకాపాను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్‌కు నాలుగేళ్ల తర్వాత బీసీలు గుర్తుకు వచ్చి జయహో బీసీ సభ నిర్వహించారని ఎద్దేవా చేశారు. సభకు రాకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని బెదిరించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి తనకు కొత్త కాదని, రాష్ట్రాన్ని కాపాడుకోవడం, పిల్లల భవిష్యత్తు కోసం తాపత్రయపడుతున్నట్టు చెప్పారు. పొన్నూరు నియోజకవర్గంలో ధూళిపాళ్ల నరేంద్రను నేరుగా ఎదుర్కోలేక సంగం డెయిరీపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. సంగం డెయిరీని కాదని గుజరాతీ కంపెనీ అమూల్‌ను ప్రోత్సహించడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు.తెదేపా అధినేత చంద్రబాబుకు గుంటూరు జిల్లా పర్యటనలో ఘన స్వాగతం లభించింది. పెదకాకాని వద్ద పొన్నూరు నియోజకవర్గంలోకి ప్రవేశించగానే తెదేపా శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా బుడంపాడు చేరుకున్నారు. బుడంపాడు వద్ద చంద్రబాబును గజమాలతో ఘనంగా స్వాగతించారు. బుడంపాడు నుంచి బైక్ ర్యాలీతో చంద్రబాబు పర్యటన సాగింది. నారా కోడూరు సభకు తెదేపా కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా భారీగా తరలివచ్చారు. ఇవాళ్టి నుంచి 3 రోజుల పాటు గుంటూరు, బాపట్ల జిల్లాల్లో చంద్రబాబు పర్యటన సాగనుంది.

## సీఎం జగన్ కీలక ప్రకటన

తాడేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి అన్ని నియోజకవర్గాల పరిశీలకులు, జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో ఆర్డినేటర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం జగన్ కీలక ప్రకటన చేశారు. 5 లక్షల 20 వేల మంది గ్రామ సారథులను నియమించాలని పార్టీ నేతలను ఆదేశించారు. క్లస్టర్‌కి ఇద్దరు గ్రామ సారథులు నియమించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్‌లు నియామకం చేపట్టాలన్నారు. ప్రతి 50 కుటుంబాలు ఒక క్లస్టర్‌గా గుర్తించాలని సీఎం జగన్ ఆదేశాలిచ్చారు.

## కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 9.79 లక్షల ఖాళీలు..

### లోక్‌సభలో కేంద్ర మంత్రి వెల్లడి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 9.79 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో గ్రూప్ ఏ పోస్టులు 23,584, గ్రూప్ బీ పోస్టులు 1,18,807, గ్రూప్ సీ పోస్టులు 8,36,936. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ఈ విషయం తెలిపారు. వివిధ కేంద్ర శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పోస్టుల ఖాళీల సంఖ్యపై కాంగ్రెస్ ఎంపీ దీపక్ బైజ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ ఏడాది ఆగస్ట్ నాటికి కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రైల్వే మంత్రిత్వ శాఖలో 2,93,943 ఖాళీలు, రక్షణ (సివిల్) శాఖలో 2,64,704 ఖాళీలు, హోం వ్యవహారాల శాఖలో 1,43,536 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.'రైల్వేలో మొత్తం 15,14,007 పోస్టులు ఉండగా, 2,93,943 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం రైల్వేలో 12,20,064 మంది ఉద్యోగులున్నారు. అదేవిధంగా డిఫెన్స్ (సివిల్)లో 6,46,042 పోస్టులు మంజూరుకాగా 2,64,707 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హోం వ్యవహారాల శాఖలో మంజూరైన 10,85,728 పోస్టుల్లో 1,43,536 పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని లోక్‌సభకు తెలిపారు. మరోవైపు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో 446 పోస్టులు మంజూరుకాగా 129 ఖాళీలు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. అలాగే రాష్ట్రపతి సెక్రటేరియట్‌లో మంజూరైన 380 పోస్టులకు 91 ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పీఎస్‌యూలు, స్వయంప్రతిపత్త సంస్థలు, బ్యాంకులు, ఇతర సంస్థల ద్వారా 1.47 లక్షల కొత్త నియామకాలు జరిగాయని వెల్లడించారు. కాగా, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

## సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే



తాడేపల్లి: అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.శ్రీనాథ్ రెడ్డితో పాటు పీలేరు నియోజకవర్గ టీడీపీ నేతలు జి వి. రాకేష్ రెడ్డి, ఎం.వెంకట కృష్ణారెడ్డి, వి.ఉమాకాంత్ రెడ్డి, బి.నరేందర్ రెడ్డి, జి.నరేష్‌కుమార్ రెడ్డి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మైనారిటీస్ కమిషన్ ఛైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

## ఆ కుటుంబం వద్ద రూ.5కోట్లు తీసుకున్న ఘనుడు దామచర్ల జనార్ధన్: బాలినేని



ప్రకాశం: భూ ఆక్రమణలపై టీడీపీ నేత దామచర్ల జనార్ధన్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు.రెండు కుటుంబాల మధ్య భూవివాదంలో ఓ కుటుంబం వద్ద రూ.5కోట్లు తీసుకున్న ఘనుడు దామచర్ల జనార్ధన్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వివాదంలో రూ.5కోట్లు తీసుకోలేదని దామచర్ల ప్రమాణం చేయగలారా? అంటూ ప్రశ్నించారు. బ్యాంకులను మోసం చేసి రూ.100కోట్లు కొట్టేసిన చరిత్ర ఆయనది అంటూ ఫైర్ అయ్యారు.

## కదనోత్సాహం.. జయహో బీసీ.. జయహో జగన్

**జగన్నినాదాలతో ప్రతిధ్వనించిన మహాసభ ప్రాంగణం**

**బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన దాని కంటే సీఎం మిన్నగా చేస్తున్నారని హర్షాతిరేకాలు**

**ఇందిరాగాంధీ స్టేడియం నలువైపులా రోడ్లపైనే నిలిచిపోయిన వేలాది మంది ప్రతినిధులు**

**చంద్రబాబు ద్రోహాన్ని ఇంటింటికీ వెళ్లి చాటి చెబుతామన్న బీసీలు**

**జయహో బీసీ మహాసభ గ్రాండ్ సక్సెస్.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం**

'మేమంతా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా మన సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు.. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కానేకాదు.. బ్యాక్ బోన్ అని చేతల్లో నిరూపించారు. అందువల్లే మేమంతా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నాం.. అందువల్లే పార్టీ ఇచ్చిన ఒక్క పిలుపునకు ఇంత స్పందన.. సీఎం జగన్ మాట్లాడిన ప్రతి మాటకూ ప్రతిస్పందన.. ఈ జన సునామిని చూసిన చంద్రబాబుకు, దుష్టచతుష్టయానికి ఇక నిద్ర కరువే' అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరోత్సాహంతో బల్లగుద్ది చెబుతున్నాయి.జయహో బీసీ మహాసభ ప్రాంగణం నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: వెనుకబడిన కులాలే వెన్నెముక అనే నినాదంతో నిర్వహిస్తున్న 'జయహో బీసీ మహాసభ'కు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపే ప్రభంజనమైంది.. దూరాభారాన్ని లెక్క చేయక ఒడిశా సరిహద్దులోని ఇచ్ఛాపురం, తమిళనాడు సరిహద్దులోని కుప్పం, కర్ణాటక సరిహద్దులోని హిందూపురం, తెలంగాణ సరిహద్దులోని మంత్రాలయం.. ఇలా రాష్ట్రం నలుమూలల నుంచి పోటాపోటీగా బీసీ ప్రజాప్రతినిధులు మంగళవారం రాత్రి నుంచే విజయవాడకు తరలివచ్చారు.బుధవారం ఉదయం 5 గంటలకే ఎముకలు కొరుకుతున్న చలిని ఖాతరు చేయకుండా.. మంచు తెరలను చీల్చుకుంటూ.. సూర్యోదయానికి ముందే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాసభ ప్రాంగణానికి కదలి తరంగంలా పోటెత్తారు. ఉదయం 9 గంటలకు మహాసభ ప్రాంగణం జన సంద్రంగా మారింది. ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో బందరు రోడ్డుతోపాటు ఇందిరాగాంధీ స్టేడియంకు నలువైపులా వేలాది మంది ప్రతినిధులు రహదారులపైనే ఉండిపోయారు.దాంతో మహాసభ ప్రారంభం కావాల్సిన షెడ్యూల్ సమయం ఉదయం 10 గంటల కన్నా 45 నిముషాల ముందే.. 9.15 గంటలకే ఆరంభమైంది. జ్యోతి ప్రజ్వలన చేసి.. మహాత్మా జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి.. సభను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాసభ ప్రాంగణానికి 12 గంటలకు చేరుకున్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్.. 1.35 గంటల వరకు కొనసాగించారు. అప్పటి వరకు మహాసభ ప్రాంగణం నుంచి ఏ ఒక్కరూ కట్టు కదలలేదు. నేతలందరి ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. రహదారులపై గంటల తరబడి నిలబడిన వారూ అడుగు కదపకుండా ఎల్‌ఈడీ తెరలపై మహాసభను వీక్షిస్తూ ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు.



## ఏ అవకాశం దొరికినా ఏపీ ఉమ్మడిగా ఉండాలనే కోరతాం: సజ్జల



అమరావతి: రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తొలి నుంచీ వైకాపా పోరాటం చేసిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.కుదిరితే మళ్లీ ఏపీ ఉమ్మడిగా కలసి ఉండాలన్నదే వైకాపా విధానమని ఆయన వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రం అయ్యేందుకు ఏ అవకాశం దొరికినా మళ్లీ కలిసేందుకే తమ పార్టీ ఓటు వేస్తుందని చెప్పారు. అయితే విభజన జరిగి 8 ఏళ్లు ॥ పూర్తయినందున పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపైనే తాము దృష్టిపెడుతున్నామన్నారు. అమరావతిలో మీడియాతో సజ్జల మాట్లాడారు."అప్పట్లో తెదేపా, కాంగ్రెస్, భాజపా రాష్ట్ర విభజనకు అనుకూలంగా వ్యవహరించాయి. విభజనకు వ్యతిరేకంగా తొలి నుంచి పోరాటం చేసింది.. మళ్లీ ఉమ్మడి ఏపీ అయితే తొలుత స్వాగతించేది వైకాపానే. ఏపీ విభజన చట్టం అసంబద్ధమని సుప్రీంకోర్టులో కేసు ఉంది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా కోర్టులో మా వాదనలు బలంగా వినిపిస్తాం. విభజన జరిగిన తీరుపైనే న్యాయస్థానంలో కేసు వేశారు. ఉమ్మడి ఏపీ కలిసి ఉండాలన్నదే ఇప్పటికీ మా విధానం. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించారనే భావన ప్రజల్లో బలంగా ఉంది. మళ్లీ ఉమ్మడి ఏపీ కాగలిగే అవకాశముంటే ఆ విషయంలో ఎంతవరకైనా ముందుకెళ్లేది వైకాపానే. ఏ వేదిక దొరికినా మళ్లీ కలిసేందుకే ఓటు వేస్తాం. విభజన చట్టంలో హామీల అమలుపై పోరాటం చేస్తూనే ఉంటాం. రెండు రాష్ట్రాలు కలిసుండాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తే అంతకంటే ఏం కావాలి?" అని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

## సీఎం జగన్ స్ట్రాంగ్ నిర్ణయం..

### కాదనే ధైర్యం టీడీపీకి ఉందా?

తాడేపల్లి: చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క మాట నిలబెట్టుకోలేదని.. మాటలు తప్ప చేతలు లేవని మంత్రి బొత్స సత్యనారాయణ దుయ్యబట్టారు.గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు బీసీల గురించి ఏరోజైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు.ఇప్పుడు సీఎం జగన్ పారదర్శక పాలన అందిస్తున్నారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని మంత్రి అన్నారు. బీసీల సభ గురించి టీడీపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. సభ సక్సెస్ కావడం జీర్ణించుకోలేపోతున్నారు. ఎవరి గురించైనా చులకన భావంతో మాట్లాడటం సరికాదు. చంద్రబాబు మైండ్ సెట్ మార్చుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ హితవు పలికారు."బీసీ మంత్రులకు పవర్ లేదంటూ టీడీపీ బీసీ నేతలు విమర్శించారు. తోటి బీసీలను అవమానపరచటమే ఇది. నామినేటెడ్ పోస్టులు కూడా టీడీపీ హయాంలో ఇవ్వలేదు. ఎంతసేపూ చంద్రబాబుకు చెక్క భజన చేయటమే ఆ పార్టీ నేతల పని. జగన్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని బీసీలను అందలం ఎక్కించారు. 50 శాతం పోస్టులు బీసీలకు దక్కేలా జగన్ స్ట్రాంగ్ నిర్ణయం తీసుకున్నారు. దాన్ని కాదనే ధైర్యం టీడీపీ చేయగలదా?" అంటూ మంత్రి సవాల్ విసిరారు."తండ్రి కంటే రెండు అడుగులు ముందుకేసి జగన్ పరిపాలన చేస్తున్నారు. బీసీలందరికీ మేలు జరగాలనీ, అందరికీ మంచి జరగాలని సంక్షేమ పథకాలు తెచ్చారు. రాజ్యసభలో నలుగురు బీసీలు ఉన్నారు. ఇది వాస్తవం కాదా?. ఎవరైనా ఎస్సీల్లో పుట్టాలని కోరుకుంటారా? అన్నాడు చంద్రబాబు. ఆవేదన చెప్పుకోవడానికి వచ్చిన బీసీలకు తోకలు కత్తిరిస్తానన్నారు. ఇవన్నీ వాస్తవం కాదా?. అందుకే ఆ బడుగు, బలహీన వర్గాల కోసమే జగన్ ఈ సంక్షేమ పథకాలు తెచ్చారు. 16 లక్షల మందికి వీటి లబ్ధి చేకూరింది. మరి చంద్రబాబు ఎందుకు ఇవన్నీ చేయలేదు" అని మంత్రి బొత్స ప్రశ్నించారు.



# సంపాదకీయం

శుక్రవారం 09-12-2022

## ఆప్ ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నట్టేనా

ఎక్కడ ఎన్నికలు జరిగినా సరే...అక్కడ కాషాయ జెండా ఎగిరి తీరుతుంది". బీజేపీ శ్రేణులు తరచూ చెప్పే మాట ఇది. ఆ మాటకు తగ్గట్టుగానే... దాదాపు అన్ని రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుస్తూ వచ్చింది. దక్షిణాది రాష్ట్రాల విషయం పక్కన పెడితే...నార్త్‌లో మాత్రం దాదాపు పాతుకుపోయింది. ఉప ఎన్నికైనా, మున్సిపల్ ఎన్నికలైనా...చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయ వ్యూహాలు రెడీ చేసుకుంటుంది బీజేపీ. ఇప్పుడు ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల విషయంలోనూ అదే వ్యూహం అనుసరించింది. కానీ...ఈ సారి మాత్రం ఫెయిల్ అయింది. ఇందుకు కారణాలేంటన్నది పక్కన పెడితే...ఓటమి ఓటమే. బీజేపీని నేరుగా తలపడి జాతీయ స్థాయిలో ప్రభావం చూపించాలని ఉవ్విళ్లూరుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీకి ఈ ఎన్నికలతో రూట్ క్లియర్ అయినట్టే కనిపిస్తోంది. నిజానికి...ఆప్ సాధించింది సాదాసీదా విజయం కాదు. బీజేపీ 15 ఏళ్లుగా ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తూ వస్తోంది. ఈ సారి కూడా గెలవడాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇలాంటి బీజేపీ కంచుకోటను కదిలించి గెలుపొందింది ఆప్. దాదాపు రెండు నెలలుగా లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. అది కాస్తా...జాతీయ అంశమైంది. ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియాపై ఎన్నో ఆరోపణలొచ్చాయి. ఆప్ ఓ "అవినీతి పార్టీ" అని బీజేపీ బాగా ప్రచారం చేసింది. కానీ...ఎందుకో ఇవేవీ వర్కౌట్ కాలేదు. మంచి మెజార్టీతో ఆప్...అధికారాన్ని సొంతం చేసుకుంది. ఇటీవలే పంజాబ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది ఆమ్‌ఆద్మీ పార్టీ. అక్కడి కాంగ్రెస్‌పై విజయం సాధించింది. "కాంగ్రెస్‌ను ఓడించడం సులువేమో కానీ..బీజేపీని గెలవటం ఆప్ తరం కాదు" అని కాషాయ శ్రేణులు పదేపదే కామెంట్ చేసేవారు. ఇప్పుడీ విజయంతో కేజ్రీవాల్ గట్టి బదులే ఇచ్చినట్టైంది. అందుకే...మనీశ్ సిసోడియా "ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీని...మా చిన్న పార్టీ ఢీకొట్టి గెలిచింది" అని వ్యాఖ్యానించారు. పైగా...గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలు జరిగినప్పుడే ఢిల్లీలోనూ ఈ ఎన్నికలు జరగటం, ఇక్కడ విజయం సాధించడం ఆప్‌నకు మంచి బూస్టింగ్ ఇచ్చింది. రాబోయే ఆ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ఆసక్తిని, ఆశను ఇంకా పెంచింది. "మోడీ డబుల్ ఇంజిన్ సర్కార్"వర్సెస్" నినాద ప్రభావం ఢిల్లీలో కనిపించలేదని, మిగతా రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ అదే రిపీట్ అవుతుందని ఆప్ చాలా కాన్ఫిడెంట్‌గా చెబుతోంది. అంతే కాదు. జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీ కోసం రూట్ మ్యాప్ కూడా రెడీ చేసుకుంటోంది. "మాకు గుజరాత్‌లో 15-20% ఓట్లు వచ్చినా అది మా విజయంగానే భావిస్తాం. బీజేపీ కంచుకోటలో ఆ మాత్రం ఓట్లు రాబట్టుకోగలిగాం అంటే ప్రజలు మమ్మల్ని నమ్ముతున్నట్టే కదా. ఎప్పటికైనా బీజేపీకి ప్రత్యామ్నాయం ఆప్ మాత్రమే" అని బల్లగుద్ది చెబుతున్నారు కేజ్రీవాల్. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో గెలవడం...ఆప్ ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచేసింది. గుజరాత్‌లో కేజ్రీవాల్ ప్రచారం చాలా అగ్రెసివ్‌గా సాగింది. 20కిపైగా ర్యాలీలు చేపట్టారాయన. గతంలో ఎప్పుడూ లేనంతగా..హిందుత్వ ఓటు బ్యాంకుకీ ఎర వేశారు. ఆ వర్గాన్ని ఆకట్టుకున్యేఖ్యలూ చేశారు. కేజ్రీవాల్ వర్సెస్ మోడీ అనే తన పొలిటికల్ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు ఢిల్లీలో గెలవడం వల్ల ఆప్ మైలేజ్ ఇంకా పెరిగే అవకాశాలు చాలానే ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో సరైన రీతిలో అభివృద్ధి జరిగితే "ఢిల్లీ మోడల్" అనే ప్రచారాస్త్రాన్ని ప్రయోగించేందుకూ వీలవుతుంది. అది సక్సెస్ అయ్యే అవకాశమూ ఉంటుంది. మొత్తంగా...ఆమ్‌ఆద్మీ పార్టీకి ఈ విజయం బూస్ట్ లాంటిదే. ఇక కాంగ్రెస్ అయితే ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కూడా కాంగ్రెస్‌కు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. కేవలం 9 వార్డులకే పరిమితమైంది ఆ పార్టీ. అంతే కాదు. ఓటు షేర్ కూడా దారుణంగా పడిపోయింది. 2017 మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 30 వార్డుల్లో విజయం సాధించింది. 21% ఓటు షేర్‌ని రాబట్టుకుంది. ఈసారి ఈ ఓటు షేర్ 11.68%కి పడిపోయింది. ఆప్ అభ్యర్థులతో పోటీ పడలేక చాలా వార్డుల్లో వెనకబడిపోయింది. 2017 ఎన్నికల్లో విజయం సాధించి...కాంగ్రెస్‌కు కంచుకోటలు అనిపించుకున్న స్థానాలనూ చేజార్చుకుంది. ఓల్డ్ ఢిల్లీ లాంటి స్ట్రాంగ్ బేస్‌లోనూ ఓటమి పాలైంది. సీతారాం బజార్ వార్డ్‌లో 2007,2012,2017లో వరుసగా కాంగ్రెస్ అభ్యర్థి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాడు. కానీ...ఈసారి ఈ వార్డులోనిప్రజలు ఆప్‌వైపు మళ్లారు. ఢిల్లీ గేట్, జామా మసీద్, దర్యగంజ్ వార్డుల్లోనూ 2017లో విజయం సాధించిన కాంగ్రెస్...ఈ సారి ఈ మూడు వార్డులనూ కోల్పోవాల్సి వచ్చింది. ఈ ప్రాంతాల్లో ఆప్ విజయం సాధించింది. ఈశాన్య ఢిల్లీలోని ముస్తఫాబాద్, నైరుతి ఢిల్లీలోని ఆయా నగర్‌తో పాటు ఆగ్నేయ ఢిల్లీలోని జకీర్ నగర్‌లో మాత్రమే మరోసారి విజయం సాధించింది. బ్రిజ్‌పురిలోనూ మళ్లీ గెలిచింది. నిజానికి...కాంగ్రెస్ పార్టీకి చెందిన షీలా దీక్షిత్ ఢిల్లీకి మూడు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరిం చారు. ఎప్పుడైతే ఆప్ ప్రభంజనం మొదలైందో... అప్పటి నుంచి ఆమెను పార్టీ నుంచి పక్కకు పెట్టడం మొదలు పెట్టింది అధిష్ఠానం. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కాంగ్రెస్‌కు నాయకత్వ లేమి కొనసాగుతూనే ఉంది. చూపించలేకపోతోంది కాంగ్రెస్. అంతే కాదు. ఢిల్లీలో 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క స్థానంలో విజయం సాధించలేదు. రాహుల్ గాంధీ నేతృత్వంలో భారత్ జోడో యాత్ర టికీ...అది ఎన్నికలపై పెద్దగా ప్రభావం చూపించలేదని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి

# పంచాయితీల్లో ఇబ్బంది తప్పదు

విజయవాడ, డిసెంబర్ 8, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం అంతర్గతంగా పలు సర్వేలు నిర్వహిస్తోంది. వాలంటీర్ల నుండి వస్తున్న సమాచా రంతోపాటు సొంత వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు ప్రత్యేక నివేదికలు తెప్పించుకుంటోంది. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అందుతున్న ప్రజల్లో సంతృప్తి ఎలా ఉందనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. అలాగే ప్రజాప్రతినిధుల పనితీరుమీద ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ వైసిపి కార్యక్రమం లో పలుచోట్ల నిలదీతలు ఎదురవడంతో ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. ఎందుకు జరిగిందనే కోణంలోనూ ప్రభుత్వం, వైసిపి నాయకులు ఆలోచనలో పడ్డారు. ఈ క్రమం లో సంక్షేమ పథకాల అమలు తీరుపై అంతర్గతంగా సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఎక్కువచోట్ల నుండి కొంత అనుకూలత ఉన్నప్పటికీ పెరిగిన భారాల వల్ల ప్రజల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతు న్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. సంక్షేమ కార్యక్రమాల అమల్లో భాగంగా ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమచేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యక్ష సంబంధాలు కొంత తగ్గాయి. ఏ పథకం అమలు చేయాలన్నా నేరుగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు వెళ్లి పెద్దఎత్తున సభలు నిర్వహించి ప్రచారం చేసి వచ్చేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయడం వల్ల ఎమ్మెల్యేలతో పెద్దగా అవసరం లేకుండా పోయిందనే అభిప్రాయం ప్రజల్లో వెల్లడైనట్లు తెలిసింది. లబ్ధిపొందిన వారు ఓట్లు వేయకపోతారా అనే అబ్భిప్రాయంతో ప్రజా ప్రతినిధులూ ఉన్నట్లు తెలిసింది. ఇది క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం కలిగించే అంశమని వైసిపి నేతలూ భావిస్తున్నారు. మరోవైపు పార్టీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు పెరిగాయి. జిల్లా స్థాయిలో జెడ్‌పి ఛైర్మన్లు, ఎమ్మెల్యేల మధ్య పలుచోట్ల ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీకి ఇబ్బందేననే కోణంలో నాయకులు ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేస్తు న్నారు. త్వరలోనే దీనిపై స్పష్టమైన ప్రకటన రానుంది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలనూ కలుసుకునే విధంగా ప్రభుత్వం నిరంతర కార్యా చరణకు రూపకల్పన చేయనున్నట్లు సమాచా రం. సుమారు 50 ప్రధాన కార్పొరేషన్లకు సంబంధించి ఆయాకులాల వేర్వేరు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. దీనికోసం ప్రభుత్వం వైపు నుండి కులాల వారీగా బుక్‌లెట్లు ప్రచురిస్తున్న ట్లు తెలిసింది. ఇంటింటికీ వైసిపిలో పంచిన వివరాలు కాకుండా ఇక ముందు కార్పొరేషన్ల వారీగా సమాచారం తీసుకుని, వాటిని ఆయా కులాల సభల్లో పంచనున్నారు. ఈ కార్య క్రమాలన్నిటికీ సిఎం నేరుగా హాజరవ్వాలని నిర్ణయిం చుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి స్థాయిలో ఆయా వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడం, అదే వేదికపై ఎమ్మెల్యేలు, ఎంపిలకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా ప్రజల్లో అక్కడక్కడా ఉన్న అసంతృప్తిని కూడా తగ్గించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అనంతరం మరో విడత ప్రజాప్రతినిధులందరూ ఇంటింటికీ వెళ్లే కార్యక్రమానికి రూపకల్పన చేయనున్నట్లు తెలిసింది. ముఖ్యంగా పంచాయతీ సర్పంచుల వ్యవహారమూ స్థానికంగా వైసిపికి ఇబ్బంది కలిగించే అంశంగా మారింది. వార్డు, గ్రామ సచివాలయాలతో స్థానికంగా సర్పంచులు, ఎంపిపిలకు విలువ లేకుండా పోయిందనే అభిప్రాయం రావడంతో దాన్ని కూడా సరిచేసే కోణంలో ప్రభుత్వం ఉంది.

# డ్రాగన్ ఫ్రూట్... కాసులు

రాజమండ్రి, డిసెంబర్ 8 అందరూ వెళ్లే దారిలో వెళ్లాలనుకోలేదాయన.. ఫ్రూట్‌ఫుల్‌గా ఉండే డ్రాగన్ సాగుపై దృష్టిసారించారు. ఔషధగుణాలు అధికంగా ఉండే ఈ పండ్లకు ఉన్న డిమాండ్ తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు వెళ్లి అక్కడ సాగవుతున్న పంటను వారం రోజుల పాటు పరిశీలించారు. ఈ ఏడాది ఆగస్టులో అమెరికన్ బ్యూటీషన్ (ఎంఎం గోల్డ్) రకం విత్తనం తీసుకుని ఎస్.అన్నవరంలో తనకున్న 2.40 ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు.ఆయనే తూర్పు గోదావరి జిల్లా మెట్ట ప్రాంతానికి చెందిన పోలిశెట్టి రామారావు (టైల్స్ రామారావు). ఒకసారి నాటితే మూడేళ్ల నుంచి 25 ఏళ్లు ఏకధాటిగా (ఫిబ్రవరి నుంచి నవంబర్ వరకు) డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయాన్ని పొందవచ్చని ఆయన చెబుతున్నారు. దీని సాగుకు మెట్ట ప్రాంత నేలలు అనుకూలంగా ఉన్నాయంటున్నారు. ఆరు అడుగులు ఎత్తులో చక్రాకారంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ లభించిన మట్టల నుంచి సేకరించిన విత్తనాన్ని సిమెంట్ స్తంభాల చట్టూ నాలుగైదు నాటుకోవాలి. మూడు నెలల్లో సిమెంట్ స్తంభాలకు విస్తరిస్తుంది. అప్పటి నుంచి ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం లభిస్తుంది. విస్తారంగా ఫలసాయాన్ని పొందేందుకు నవంబరు, ఫిబ్రవరి మధ్యకాలంలో వచ్చే పూతను రైతులు ఎప్పటికప్పుడు తొలగించడం ఉత్తమం. దీంతో ఫిబ్రవరి నుంచి అధికంగా ఫలసాయం లభించనుంది. తొమ్మిది నెలల్లో ఎకరాకు నాలుగు నుంచి పది టన్నులు డ్రాగన్ ఫ్రూట్స్ లభిస్తాయి. చీడపీడలు ఆశించకపోవడంతో రసాయనక ఎరువులు, మందులు వాడాల్సిన పనిలేదు. విస్తారంగా పంట విరబూసేందుకు గో మూత్రం, వివిధ రకాల ఆకులతో తయారు చేసిన కషాయాల పిచికారీ, కలుపు నివారణ, వేసవిలో రెండు రోజులకు డ్రిప్ పద్ధతిలో ఒక తడుపు వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి.ఎండవేడిమిని అదుపు చేసేందుకు డ్రాగన్ ఫ్రూట్ చక్రాకార సిమెంట్ స్తంభాలను ఆనుకుని సీతాఫలం మొక్కలు వేసుకోవడం మంచిది. ఫ్రూట్ తొలగించిన రెబ్బలు (మట్టలు) నుంచి రైతు సొంతంగా విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు. విత్తనాన్ని విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. పుచ్చకాయ మాదిరిగా తియ్యని రుచి కలిగిన డ్రాగన్ ఫ్రూట్స్‌లో



అబ్బుర పరిచే ఎన్నోపోషక విలువలు ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, తెల్లరక్త కణాలు, ప్రేగుల్లో మంచి చేసే 400 రకాల బ్యాక్టీరియాల వృద్ధి, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, మలబద్ధకాన్ని నివారించడం, రోగ నిరోధక శక్తిని పెంపొందించడం, జీర్ణాశయ రుగ్మతలు తొలగించే పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో డ్రాగన్ ఫ్రూట్స్‌కి రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది.డ్రాగన్ ఫ్రూట్స్‌కు ఉన్న డిమాండ్‌తో సాగు చేయాలన్న ఆసక్తి కలిగింది. తెలంగాణ రాష్ట్రం నల్గొండలో వారం రోజులు పంటను పరిశీలించి, సాగు, సంరక్షణ, సస్యరక్షణ తదితర విషయాలపై అవగాహన వచ్చింది. సీజన్‌లో ఎకరానికి నాలుగు నుంచి పది టన్నులు దిగుబడి, రూ.లక్షల్లో ఆదాయం వస్తుందని తెలుసుకున్నాను. ఆగస్టులో అమెరికన్ బ్యూటీషన్ (ఎంఎం గోల్డ్) రకం విత్తనం తీసుకువచ్చాను.

# కుప్పం కోటే టార్గెట్

తిరుపతి, డిసెంబర్ 8, ధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. కానీ.. ఇంకో నెల రోజుల్లో ఎలక్షన్ ఉందన్నట్టు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, జనసేన విషయం ఎలా ఉన్నా.. తెలుగుదేశం, వైఎస్సార్సీపీ మాత్రం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు పంపుతున్నాయి. అటు వరుస సమావేశాలు నిర్వహిస్తూ జగన్.. ప్రజల్లో ఉంటూ చంద్రబాబు ఎన్నికలకు రెడీ అవుతున్నారు. ప్రజలను ఆకర్షించే నినాదాలు ఇస్తూ.. ఎలక్షనీరింగ్ మొదలుపెట్టారు. ఈ సమయంలో.. అధికార వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చింతంగా 175 స్థానాల్లో విజయం సాధిస్తాం. వాటిలో ముందు కుప్పం నియోజకవర్గమే ఉంటుంది. కుప్పంలోనే గెలిచాక.. మిగతా నియోజకవర్గాల్లో ఏముంది. ఇన్నాళ్లు కుప్పం ప్రజలను చంద్రబాబు మోసం చేశారు. ఏదో చేస్తారని అక్కడి ప్రజలు ఆశపడ్డారు. కానీ చంద్రబాబుతో ఏమీ జరగబోదని ప్రజలకు అర్థం అయ్యింది. అందుకే ప్రజలు కూడా చంద్రబాబును ఓడించాలని డిసైడ్ అయ్యారు. అది స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది' అని సజ్జల రామకృష్ణా రెడ్డి వ్యాఖ్యానించారు.అటు తెలుగుదేశం పార్టీ కూడా కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. చంద్రబాబు మళ్లీ కుప్పం నుంచే పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటు లోకేశ్ కూడా మళ్లీ మంగళగిరి నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారట. అయితే.. చంద్రబాబును కుప్పంలోనే కాకుండా.. మరో నియోజకవర్గంలోనూ పోటీ చేయాలని కొందరు పార్టీ నేతలు కోరినట్టు ప్రచారం జరుగుతోంది. కుప్పంపై జగన్ ఫుల్ ఫోకస్ పెట్టడంతో.. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తే.. మేలు అనే అభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం.చంద్రబాబు ఒప్పుకోలేదు అని తెలుస్తోంది. నిజంగానే కుప్పం సహా.. మరో నియోజకవర్గంలో పోటీ చేస్తే.. అధికార పార్టీకి భయపడినట్టు అవుతుందని.. తద్వారా.. పార్టీ నేతలు, కార్యకర్తలు డీలా పడతారని చంద్రబాబు అన్నట్టు సమాచారం. అందుకే.. పార్టీ తరఫున కేడర్‌ను సమాయత్తం చేసి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిరిగా కాకుండా.. కచ్చితంగా గెలిచేలా పనిచేయాలని చంద్రబాబు సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. అటు.. ఇతర నియోజకవర్గాల్లోనూ గెలుపు గుర్రాలకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. దీంతో కుప్పంపై అందరి దృష్టి పడింది. అటు రెండు పార్టీలు మిషన్ కుప్పం అంటూ హీట్ పెంచుతున్నాయి.

## పవన్ కళ్యాణ్ సీఎం అవ్వాలని పూజలు, హోమాలు

రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పవన్ కళ్యాణ్ సీఎం అవ్వాలని రాజానగరం జనసేన నేత బత్తుల బాలరామకృష్ణ తమిళనాడు నుండి 11మంది వేద పండితులను తీసుకొచ్చి గోదావరి నది తీరాన రాజమాతంగి ప్రత్యేక హోమ జరిపించారు. రాజనగరం నియోజకవర్గం సీతానగరం మండలం రామచంద్రపురం గ్రామ సమీపంలో ఉన్న గోదావరి నది మధ్యలో బత్తుల బలరామకృష్ణ దంపతులచే రాజా మాతంగి హోమం వేద పండితులతోమంత్రోత్సవం నడుమ భక్తిశ్రద్ధలతో యోగం నిర్వహించారు. ఈ యాగం పేరు రాజమాతంగి యాగం అలాగే రాజ్యశ్యామల యాగమని కూడా అంటారని అన్నారు99 గతంలో కూడా రాష్ట్రముఖ్యమంత్రులు ఈ యాగం చేయడం వల్ల అమ్మవారు కరుణాకటాక్షాలు రాజకీయ యోగం పడుతుందని పురాణంలో చెబుతున్నాయి ఈ రాష్ట్రానికి జనసేన పార్టీ అధికారం రావాలని, పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని, యాగం నిర్వహించడం జరిగిందని అయన అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సినీ రచయితకు గాయాలు

నంద్యాల నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు మెట్ట జాతీయ రహదారి వారిపై తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఘటనలో సినీ రచయిత, డైరెక్టర్ రాజసింహకు గాయాలయ్యాయి. రాజసింహ హైదరాబాదు నుండి తిరుపతికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం తప్పించబోయి ఎదురెదురుగా ఢీ కొన్నాయి. అయన ఎడమ కాలు విరిగింది. సమాచారం తెలిసిన వెంటనే రూరల్ ఎస్సై నర్సింలు, సిబ్బంది అక్కడి చేరుకొని గాయపడిన డైరెక్టర్ టి రాజసింహను 108 లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

# కడపలో డెంగ్యూ డేంజర్ బెల్స్

కడప, డిసెంబర్ 8, కడప జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించడంతో దోమల వ్యాప్తి అధికమవుతోంది. దీంతో కొద్దిపాటి జ్వర లక్షణాలు కనిపించినా ప్రజలు ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలకు క్యూ కడుతున్నారు. జిల్లాలో 19 డెంగీ కేసులు, 13 మలేరియా కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా నమోదయ్యే కేసుల సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా డెంగీతోపాటు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండటం ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులకు వరంగా మారింది. జ్వరాలు ఎక్కువగా వస్తున్నందున ప్రజలు అది కోవిడ్ వల్ల వచ్చిందా, డెంగీ, మలేరియా, వైరల్ ఫీవరా తెలియక పరీక్షలకు వేలకు వేలు ఖర్చు చేస్తూ అవస్థలు పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్షల పేరుతో ప్రైవేటు ల్యాబ్‌ల వారు రోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో కడప రిమ్స్, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి, పులివెందుల ఆసుపత్రుల్లో డెంగీకి ఎలీషా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఇవి అందుబాటులో ఉన్నాయని తెలియక, అవగాహన లేక ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి నష్టపోతున్నారు. నిజానికి ప్రభుత్వాసుపత్రుల్లోనే డెంగీ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో ఎక్కువగా దోమ కాటువల్లే సంభవి స్తాయి. వ్యాధి కలిగిన జీవిని ఇది కుట్టి ఆరోగ్యంగా ఉన్న మరో జీవిని కుట్టడం ద్వారా వైరస్ వ్యాప్తి చెందేలా చేస్తాయి. వీటి ద్వారా మలేరియా, బోదకాలు, చికున్‌గున్యా, డెంగీ, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రస్తుత వర్షా కాలంలో దోమల వల్ల ప్రతి ఇంట్లో జనం జ్వరాల బారిన పడటం అధికమైంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా దగ్గు, జలుబు, విష జ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. కేవలం పట్టణాల్లోనే కాదు, పల్లెల్లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. గతంలో దోమలు ఆయా కాలం, వాతావరణ పరిస్థితులను బట్టి ఉధృతంగా ఉండేవి. అయితే ఇటీవల అన్ని కాలాల్లోనూ, అన్ని వేళల్లోనూ దోమలు ఉంటున్నాయి. ఖాళీ స్థలాలు: పారిశుధ్యంపై మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నిర్లక్ష్యం దోమల ఉధృతి పెరగడానికి




కారణమవుతోంది. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటున్న నీరు, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ఫాగింగ్, స్ప్రేయింగ్ సరిగా చేయకపోవడం వల్ల దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయి. దోమల నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ సక్రమంగా చేస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. చాలా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ మెషీన్లు పనిచేయక మూలనపడ్డాయి. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజలు మస్కిటో కాయిల్స్, రిపెల్లెంట్స్ వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు ఒక వైపు చెబుతున్నా తప్పని పరిస్థితి ఏర్పడుతోంది డెంగీ లక్షణాలు శరీర ఉష్ణోగ్రత పెరగడం వాంతులు, విరేచనాలు కళ్లు మంటలు, తీవ్రమైన తలనొప్పి చర్మ సమస్యలు చిగుళ్ల నుంచి రక్తస్రావం మూత్రంలో, మలంలో రక్తం పడటం కడుపు నొప్పి, జలుబు, దగ్గు నీరసం డెంగీ, మలేరి యా, టైఫాయిడ్ జ్వరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, పెద్దలు పారాసిటమాల్ తప్ప వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులు వాడకూడదు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. 101 డిగ్రీలకు మించి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, వాంతులు తదితర లక్షణాలు గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం

నంద్యాల భారతదేశ వ్యాప్తంగా హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ఆధ్వర్యంలో "పరివర్తన్" వారోత్సవాల్లో భాగంగా గత 13 సంవత్సరాల నుండి ప్రజలకు రక్తదానాలపట్ల అవగాహన కల్పించి రక్తకోరత లేని సమాజం నిర్మించాలనే సంకల్పంలో భాగంగా హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ సర్కిల్ హెడ్ ఉమేష్ కృష్ణ, నంద్యాల బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ, ఆపరేషన్స్ మేనేజర్ రామకృష్ణ రెడ్డి మరియు అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ బాషా గురువారం నాడు విలేకరుల సమావేశంలో తెలిపారు .ఈ సందర్భంగా సర్కిల్ హెడ్ ఉమేష్ కృష్ణ మాట్లాడుతూ హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ 2007 వ సంవత్సరంలో బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను ప్రారంభించింది , ఆపరేషన్స్ హెడ్ మిస్టర్ భావేష్ జావేరి మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా 4 వేల పైచిలుకు యూనిట్స్ ను సేకరించి అప్పటినుండి 2019 వ సంవత్సరం వరకు కొనసాగింది. మాకు కళాశాలలు, కార్పొరేట్ మరియు వివిధ సంస్థల భాగస్వామ్యంతో భారతదేశమంతటా సుమారుగా 4 లక్షల యూనిట్స్ రక్తం సేకరించామన్నారు , కరోనా ఆటంకం వల్ల గత 2 సంవత్సరాలు చేయలేకపోయామని అన్నారు , ఈ సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు , ఇప్పటి వరకు 14 వ సంవత్సరాలుగా ఇస్తున్నామని తెలిపారు . అలాగే సమాజంలో రక్తం యొక్క అవసరం పెరిగినందున ఇంకా మెరుగ్గా పనిచేసి ఎక్కువ రక్తం యూనిట్స్ ను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. . ఈ నెల 9-12-2022 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కర్నూలులో మౌర్య ఇన్ కాంప్లెక్స్ నందు మరియు నంద్యాలలో ఎన్.కె.రోడ్, శోభ హోటల్ ప్రక్కన ఉన్న హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ బ్రాంచ్ లలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు , ఈ రక్తదాన శిబిరాలలో ప్రతిఒక్కరు విరివిగా పాల్గొని స్వచ్ఛందంగా మీ అమూల్యమైన రక్తాన్ని దానం చేయాలని అలాగే మేము చేస్తున్న ఈ మంచి కార్యక్రమంలో మీరందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఎదురు కాల్పులు..

## ఇద్దరు మహిళా మావోలు హతం

కంధమాల్ ఒడిశాలోని కంధమాల్ జిల్లా మటకుప రిజర్వ్ ఫారెస్ట్ లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. తాడికొల గ్రామ సమీపాన కూంబింగ్ చేస్తున్న బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరపడంతోపాటు, గ్రనేడ్లతో దాడి చేశారు. దీంతో బలగాలు ఎదురుకాల్పు లకు దిగాయి. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, కోబ్రా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఈ కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోలు మృతి చెందగా, మరికొందరు తప్పించుకున్నారు. ఈమేరకు ఐజీ అమితాబ్ ఠాకూర్ వివరాలు వెల్లడించారు. మృతుల్లో ఒకరిని ఛత్తీస్ ఘడ్ కు చెందిన ఏసీఎం ర్యాంక్ కమలగా గుర్తించామని, మరొకరి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. రెండు మృతదేహాలను ఫుల్బనికి తరలించారు. మరోవైపు, వామపక్ష తీవ్రవాదంపై రాష్ట్ర, కేంద్ర పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష జరిపారు.సీఆర్పీఎఫ్ అడిషనల్ డీజీ వితల్ కుమార్, ఇంటలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ రిత్విక్ రుద్ర, ఒడిషా రాష్ట్ర ఇంటలిజెన్స్ డైరెక్టర్ సంజీవ్ పండ, దక్షిణ ప్రాంత ఐజీ సత్యబ్రాత భీయోయి తదితర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# తిరుమలలో టిక్కెట్ల కుంభకోణం

తిరుమల, డిసెంబర్ 8, ఏడుకొండలు శ్రీవేంకటేశ్వర స్వామి వారి పుణ్యక్షేత్రమైన తిరుమలలో టిక్కెట్ల కుంభకోణం బయటపడింది. తిరుమల ఉద్యోగి శ్రీహరిని టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సిఫారసు లేఖలను వీఐపీ భక్తులకు విక్రయిస్తున్నారని శ్రీహరిపై ఆరోపణలు వచ్చాయి. గతంలో టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ దగ్గర శ్రీహరి పనిచేసినట్లు తెలిపారు టీటీడీ విజిలెన్స్ అధికారులు. నందిగామ ఎమ్మెల్యే సిఫారసు లేఖపై 6 వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు రూ.18 వేలకు శ్రీహరి విక్రయించినట్లు పేర్కొన్నారు టీటీడీ విజిలెన్స్ అధికారులు.శ్రీహరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. దీంతో.. తిరుమలలో నకిలీ సేవా టిక్కెట్ల కుంభకోణం గుట్టురట్టు అయింది. నకిలీ సుప్రభాత సేవా టికెట్లతో దర్శనానికి వెళ్తున్న వారిని టీటీడీ అధికారులు పట్టుకున్నారు. 23 మంది భక్తుల దగ్గర నకిలీ సేవా టికెట్లను గుర్తించినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. సేలం కేంద్రంగా నకిలీ టికెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించామని టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# ప్లాస్టిక్ పై కఠిన ఆంక్షలు

విజయవాడ, డిసెంబర్ 8,ప్లాస్టిక్ కారణంగా పర్యావరణానికి, జంతు జీవాలకు, మానవాళికి ఎంత ప్రమాదముందో అందరికీ తెలిసిందే. అందుకే ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించగా..ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది.సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఏపీ ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. ఇప్పుడు ఈ నిర్ణయంలో కొన్ని మార్పులు చేస్తూ జీవో అప్‌డేట్ చేసింది. గతంలో ప్రవేశపెట్టిన నిబంధనల్ని కొద్దిగా మార్చింది. ప్లాస్టిక్ నిషేధాన్ని మరింత కఠినంగా అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. నిషేదాజ్ఞలు పాటించనివారిపై జరిమానా విధించాలని ఆదేశించింది. అదే విధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీదారులు, పంపిణీదారులపై సైతం పెనాల్టీ విధించాలని స్పష్టం చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.1. మొదటి తప్పుకు 25 వేల జరిమానాతో పాటు సీజ్ చేసిన వస్తువులపై కేజీకు పది రూపాయలు పెనాల్టీ2. రెండవ తప్పుకు 50 వేల జరిమానా, సీజ్ చేసిన వస్తువులపై కేజీకు 20 రూపాయలు జరిమానా, పర్యావరణ చట్టం కింద కేసులు నమోదుసింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీదారులపై పెనాల్టీ1. మొదటి తప్పుకు 50 వేల జరిమానా, ప్లాస్టిక్ వస్తువుల సీజ్2. రెండో తప్పుకు లక్ష రూపాయలు జరిమానా, రిజిస్ట్రేషన్ రద్దు, వస్తువులు-యంత్రాల సీజ్, పర్యావరణ చట్టం కింద కేసు నమోదుజరిమానాలు విధించడమే కాకుండా ప్రభుత్వ ఆదేశాలు శానిటరీ, వార్డ్ సిబ్బందికి తెలిసేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించింది. కమిషనర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మానిటరింగ్ షెడ్యూల్ వినియోగించాలని ఏపీ ప్రభుత్వం సూచించింది.

# పాపం...రోజా


తిరుపతి, డిసెంబర్ 8,మంత్రి రోజా అంటే ఫైర్ బ్రాండ్. నోరు తెరిస్తే ఎవరైనా వణికిపోవాల్సిందే. జగన్ తొలి క్యాబినెట్ లో రోజాకు స్థానం దక్కకపోవడానికీ, మలి క్యాబినెట్ లో చోటు దొరకడానికీ కూడా ఆమె డైనమిజమే కారణం అంటారు. అయితే తన చిరకాల వాంఛ నెరవేరిన తరువాత అంటే మంత్రి పదవి చేపట్టిన తరువాత పార్టీలో ఆమెకు అడుగడుగునా పరాభవాలే ఎదురౌతున్నాయి.కనీసం ప్రోటోకాల్ ప్రకారం గౌరవం కూడా ఆమెకు దక్కడం లేదు. తాజాగా తిరుపతిలో రాష్ట్రపతి పర్యటనలో రోజాకు పరాభవం ఎదురైంది. రాష్ట్రపతి పర్యటనలో జిల్లా మంత్రి హోదాలో రోజా పాల్గొన్నా ఆమెను పట్టించుకున్న వారెవరూ లేకుండా పోయారు.ట. ఎక్కడా ఎవరూ ఆమెను పట్టించుకోలేదు. ప్రోటోకాల్ ప్రకారం.. రాష్ట్రపతికి జిల్లా మంత్రి స్వాగతం చెప్పాలి. పెద్దిరెడ్డి కూడా మంత్రే. అయినప్పటికీ ఇద్దరూ స్వాగతం చెప్పే వారిలో ఉండాలి. కానీ రోజాకు చాన్స్ రాలేదు. తర్వాత కార్యక్రమంలో వేదికపై చోటు కూడా దక్కలేదు. మహిళా రాష్ట్రపతి వస్తే మహిళా మంత్రికి స్టేజ్‌పై చోటు దక్కలేదు. కనీసం ఎక్కడా మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇక రాష్ట్రపతికి వీడ్కోలు పలికే సమయంలోనూ ఆమెకు ఎలాంటి ప్రాధాన్యతా దక్కలేదు. అంటే మంత్రి హోదాలో ఉన్నా కూడా అధికారులు కూడా ఆమెను పూర్తిగా విస్మరించారనే భావించాల్సి వస్తోంది. మామూలుగా ప్రోటోకాల్.. ఇతర వ్యవహారాలు అన్నీ.. రాష్ట్రపతి సిబ్బంది చూసుకుంటారు.. కానీ రాష్ట్ర అధికారులు ఇచ్చే జాబితా ప్రకారమే రాష్ట్రపతి సిబ్బంది ఆ విషయాలను ఖరారు చేస్తారు. అధికారులు ఆ జాబితాలో రోజాకు స్థానం కల్పించలేదు. దీంతో రాష్ట్రపతి సిబ్బంది ఆమెను పట్టించుకోలేదు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా రోజాకు జరిగిన అవమానంపై ఆమె వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో రోజాకు సరైన గౌరవం లభించడం లేదనీ, మంత్రి అయినప్పటికీ సొంత నియోజ కవర్గంలో కూడా ఆమె ప్రత్యర్థి వర్గాన్ని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నదనీ, రోజాను నిర్లక్ష్యం చేస్తున్నారనీ అంటున్నారు. మంత్రి పదవి ఇచ్చినట్లే ఇచ్చి.. గౌరవం దక్కకుండా చేస్తున్నారంటున్నారు. ఈ విషయాలన్నిటినీ రోజా జగన్ దగ్గర మొర పెట్టుకున్నా.. ఫలితం లేకపోయిందని చెబుతున్నారు. పరిస్థితి చూస్తుంటే రోజాకు పొమ్మనలేక పొగబెడుతున్నారని పరిశీలకులు అంటున్నారు.

# నేల చూపులు చూస్తున్న అరటి



రాజమండ్రి, డిసెంబర్ 8,అరటి ధరలు నేలను తాకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో రైతుల నుంచి అరటి గెల రూ.80 నుంచి రూ.100కు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాది గోదావరి వరదలు అరటి రైతులను నట్టేట ముంచాయి. అరటి చెట్లు కూలిపోవటం, తెగుళ్ల విజృంభణతో దిగుబడులు పడిపోయాయి. కార్తీక మాసంలో కొద్దిగా డిమాండ్ పెరిగి ధరలు ఆశాజనకంగా ఉండడంతో కాస్తంత ఊరట లభించింది. సీజన్ ముగియడంతో ధరలు మళ్లీ నేలను తాకాయి. అరటి గెలలు నిల్వ చేసే సౌకర్యాలు లేకపోవడంతో ఎప్పుడు కోసిన గెలలు అప్పుడే అమ్ముకోవాల్సి వస్తోంది.ఉమ్మడి జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగుఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 45 వేల ఎకరాల్లో అరటిని సాగు చేస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో విస్తారంగా సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాలతో అరటి సాగు అధికంగా ఉంది. కర్పూర, తెల్ల చక్రకేళి, కూర అరటి రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 25 వేల మంది రైతులు, పరోక్షంగా ఐదు వేల మంది హోల్‌సేల్ రిటైల్ వ్యాపారులు అరటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రధాన మార్కెట్లకు ప్రతి రోజూ సుమారు 300 లారీల అరటి వస్తోందిప్రస్తుతం కోనసీమలోని రావులపాలెం, తూర్పుగోదావరిలోని పెరవలి మార్కెట్లలో పది టన్నుల అరటి గెలలను రైతుల నుంచి వ్యాపారులు రూ.65 వేలకు కొనుగోలు చేస్తున్నారు. టన్నుకు సైజును బట్టి 60 నుంచి 70 వరకూ గెలలు పడతాయి. ఈ లెక్కన గెల ఒక్కటికి రూ.80 నుంచి రూ.100 లోపుగానే ధర పలుకుతోంది. కార్తీక మాసం ప్రారంభంలో పది టన్నులకు రూ.1.20 లక్షల వరకూ ధర పలికింది. గెలకు రూ.200 వరకూ ధర లభించింది. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు సుమారు రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. అరటి చెట్టు పడిపోకుండా వెదురు గెడల ఏర్పాటు ఖర్చు దీనికి అదనం. ఒక్కొక్క వెదురు గెడ ఖరీదు సుమారు రూ.100 వరకు ఉంటోంది. ఎకరానికి 400 వెదురు గెడలకు రూ.40 వేలు అదనపు ఖర్చవుతోంది. ఎకరాకు సుమారు 500 వరకు గెలలు దిగుబడి వస్తోంది. గెల రూ.200కు పైగా అమ్మితే రూ.లక్ష వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గెలకు వంద రూపాయలలోపే ధర వస్తోందిఅరటి రైతులకు అప్పులే మిగులుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల తెగుళ్లు ఆశించడం, దిగుబడులు తగ్గిపోవడం పరిపాటిగా మారింది. సీజన్‌లో 20 రోజులు మాత్రమే ధరలు ఉంటున్నాయి. మిగిలిన రోజుల్లో పది టన్నుల గెలలకు రూ.65 వేలు మించట్లేదు. అరటిని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి.

# ఎన్నికల యుద్ధానికి ప్రచార రథం సిద్ధం



విజయవాడ, డిసెంబర్ 8,ఎన్నికల ప్రచారానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధం అవుతున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా వాహనాన్ని పవన్ తనకు కావాల్సినట్లుగా తయారు చేయించారు. ఏపీ వ్యాప్తంగా పర్యటించేందుకు ఇప్పటికే రెడీ అయిన పవన్ ఇక ఎన్నికలను టార్గెట్ గా చేసుకొని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా తన ప్రత్యేక వాహనానికి సంబందించిన ఫోటోలు, వీడియోలను పవన్ ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. వారాహి రెడీ ఫర్ ద బ్యాటిల్ అని పవన్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ వాహనాన్ని, ట్రయల్ రన్ ను పవన్ కళ్యాణ్ గారు బుధవారం హైదరాబాద్ లో పరిశీలించారు. వాహనానికి సంబంధించి కొన్ని ముఖ్య సూచనలను పార్టీ నాయకుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కి ఇచ్చారు. వాహనాన్ని తీర్చిదిద్దుతున్న సాంకేతిక నిపుణులతోను చర్చించారు. ఈ వాహనానికి వారాహి అమ్మవారి పేరుపెట్టారు పవన్ కళ్యాణ్. అన్ని దిక్కులను కాచే అమ్మవారిగా పురాణాలు చెబుతున్నాయి. దుర్గా దేవి సప్త మాతృకల్లో వారాహి అమ్మవారు ఒకరు... ఆ సప్త మాతృకలు రక్త బీజుడు అనే రాక్షసుడిని సంహరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పై ఫోకస్ పెట్టాయి. అయితే ఇదే సమయంలో పవన్ కూడా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే వారంలో రెండు రోజులు మాత్రమే పవన్ పార్టీ కార్యకలాపాలకు అందుబాటులో ఉంటున్నారు. ఇదే అంశంపై అధికార పార్టీ వైసీపీకి చెందిన నాయకులు పలు సందర్భాలలో జనసేనాని పవన్ ను టార్గెట్ చేసి కామెంట్లు చేశారు, చేస్తూనే ఉన్నారు. దీంతో వైసీపీ, జనసేన నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రధానంగా ఇప్పటంలో ఇంటి నిర్మాణాలు కూల్చి వేసే అంశంలో జనసేన పార్టీ కీలకంగా వ్యవహరించటంతో రాజకీయం మెత్తం వైసీపీ, జనసేన మధ్యనే సాగింది. ఇదే సమయంలో పవన్ అధికార పార్టీ వైసీపీని, ఏపీ సీఎం జగన్ ను అదే స్దాయిలో టర్గెట్ చేసి విమర్శలు చేశారు.వాస్తవానికి ఇప్పటికే పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాల్సి ఉంది. అనివార్య కారణాలతో పవన్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఆలస్యం అయినప్పటికీ ప్రత్యేకంగా పర్యటనకు అవసరం అయిన అన్ని అంశాల పై పవన్ ఫోకస్ పెట్టినట్లుగా జనసైనికులు చెబుతున్నారు. ప్రధానంగా అత్యంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న పవన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించటం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. సెక్యూరిటీ సమస్యల తలెత్తుతుంది. అభిమానులు పవన్ ను చూసేందుకు ఎగబడుతుంటారు. పవన్ సెక్యూరిటీ అంశాన్ని వైసీపీ ప్రభుత్వం ఎలా డీల్ చేస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచిచూడక తప్పదు. పవన్ పలుమార్లు అనేక ప్రాంతాలకు చెప్పకుండా, వివరాలను బయటకు రానీయకుండా పలు ప్రాంతాలకు వెళ్లిన ఘటనలు లేకపోలేదు. పవన్ తనకు ప్రత్యేకంగా వాహనాన్ని డిజైన్ చేయించుకున్నారు. ఈ వాహనానికి వారాహిగా పేరు పెట్టారు. వారాహి రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిన్ అని తన ఉద్దేశాన్ని ఓ వీడియో ద్వారా వెల్లడించారు. వాహనం చాలా ప్రత్యేకంగా ఉండటంతో రాజకీయ వర్గాల్లో కూడ పవన్ ఎన్నికల ప్రచారం వాహానానికి క్రేజ్ ఏర్పడింది.పవన్ తన వాహనానికి సంబందించిన ఫోటోలు, వీడియోలను ఆయనే స్వయంగా బయటకు విడుదలచేసేవారు. తన ప్రైవేట్ వెహికల్ తో పాటుగా భద్రతా సిబ్బందికి వాహనం చుట్టుపక్కల నడుస్తుండగా, వాహనం ముందుకు కదులుతున్న వీడియోను పవన్ విడుదల చేశారు. ఇదే వాహనంలో అవసరం అయితే పవన్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుంటుంది. వాస్తవానికి ఇలాంటి వాహనాలు రాజకీయ నాయకులు అందుబాటులో ఉంచుకోవటం కొత్తేమి కాదు. పవన్ కు ఇలాంటి వాహనాలు అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ పై అభిమానులు ఎగబడుతుంటారు. ఆయన కింద పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో పవన్ ఎన్నికల ప్రచార రథం హాట్ టాపిక్‌గా మారింది.పవన్ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే పవన్ పర్యటన దసరా నాటికి ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వలన పర్యటన వాయిదా వేసుకున్నారు. దీంతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుని, సంక్రాంతి తరువాత పవన్ పర్యటనను ప్రారంభించేందుకు అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సామాన్య భక్తులకు పెద్ద పీట

తిరుమల, డిసెంబర్ 8, వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుమల తిరుపతి దేవాస్థానం పూర్తి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు వీలుగా కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు అన్ని రకాల ప్రివిలైజ్ దర్శనాలు రద్దు చేసింది. అర్జిత సేవలు ఏకాంతంగా నిర్వహించనుంది. వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో వివిధ శాఖల అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు రెండు సంవత్సరాలుగా జరుగుతున్న విధంగానే ఈ ఏడాది కూడా వైకుంఠ ద్వార దర్శనం 11 రోజులపాటు కల్పించనుంది టీటీడీ. 2023 జనవరి 2వ తేదీ నుంచి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ద్వార దర్శనాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నిరకాల ప్రివిలేజ్ దర్శనాలను రద్దు చేసి.. శ్రీవాణి, ఎస్ఈడీ టిక్కెట్లు, ఎస్ఎస్డీ టోకెన్లు కలిగి ఉన్న భక్తులకు "మహా లఘు దర్శనం" కల్పించనున్నారు. రూ.300 కోటా ప్రత్యేక ప్రవేశ దర్శనం దర్శనానికి సంబంధించి రోజుకు 25 వేల టికెట్లు విడుదల చేస్తారు. 10 రోజులకు కలిపి మొత్తం 2.50 లక్షల టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. 2023 జనవరి కోటాలోనే ఈ టికెట్లను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. అదేవిధంగా తిరుమల స్థానిక భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు తిరుపతిలో 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు టీటీడీ అధికారులు.వీటి ద్వారా రోజుకు 50 వేలు చొప్పున మొత్తం ఐదు లక్షల ఎస్ఎస్డీ టోకెన్లు జారీ చేయనున్నారు. స్థానికులు కచ్చితంగా ఆధార్ కార్డ్ చూపించి ఈ టోకెన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఎస్ఎస్డీ టోకెన్లు జారీ చేసే తొమ్మిది ప్రదేశాలను రెండు క్లస్టర్‌లుగా విభజించి జేఈఓలు పర్యవేక్షిస్తారు. వైకుంఠ ద్వార దర్శనం 11 రోజులపాటు సిఫార్సు లేఖలకు తీసుకోమని టీటీడీ అధికారులు ఇప్పటికే తెలిపారు. రోజుకు 2 వేల చొప్పున శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ 2 వేల మంది దాతలు తమ దర్శన కోటాను కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. వైకుంఠ ఏకాదశికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే దర్శన టిక్కెట్లు కేటాయించనున్నారు. వైకుంఠ ద్వార దర్శాననికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో వసతి ఏర్పాట్లపై కూడా టీటీడీ అధికారులు దృష్టిపెట్టారు. న్యూఇయర్, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దృష్ట్యా ఈ నెల 29 నుంచి జనవరి 3 వరకు వసతి అడ్వాన్స్ బుకింగ్ రద్దు చేశారు. మరికొన్ని కౌంటర్లు పెంచి సీఆర్వోలో మాత్రమే గదులు కేటాయించనున్నారు. జనవరి 2వ తేదీన తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అఖండ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుంది. జనవరి 3న వైకుంఠ ద్వాదశి రోజున స్వామి పుష్కరిణి తీర్థ ముక్కోటిలో సుదర్శన చక్రత్తాళ్వార్ స్నపనం అనంతరం చక్రస్నానం చేస్తారు.

# స్వచ్ఛ మంథని లక్ష్యం

## -మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ

మంథని స్వచ్ఛ మంథని యే తమ లక్ష్యమని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ పేర్కొన్నారు. గురువారం ఉదయం మంథని మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు పరిధిలో గల అంబేద్కర్ చౌరస్తా, కాలేజీ గ్రౌండ్ రోడ్డులో పారిశుద్ధం పై ప్రత్యేక కార్యక్రమాన్ని మంథని మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త చేదరాల తొలగింపు పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు.పారిశుధ్య కార్మికులతో వాటిని తీయించారు.

# సంక్రాంతి బుకింగ్స్ ఓపెన్

విజయవాడ, డిసెంబర్ 8, పండుగలకు ఊరెళ్లుందుకు నెల రోజుల ముందు నుంచే చాలా మంది ప్లాన్ చేసుకుంటారు. ట్రైన్ టికెట్స్, బస్ టికెట్స్ ముందుగా బుక్ చేసుకుని.. ఏ రిస్క్ లేకుండా హ్యాపీగా వెళ్లిపోవాలని అనుకుంటారు. ఇక సంక్రాంతి రద్దీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పండుగకు ఇంకా చాలా సమయం ఉన్నా.. టికెట్స్‌కు మాత్రం చాలా డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే సంక్రాంతికి ఊరెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్న ప్రయాణికులకు ఏపీఎస్ఆర్టీసీ శుభవార్త అందించింది.వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు సంబంధించి బుకింగ్స్ ఓపెన్ చేసినట్లు ప్రకటించింది. ష్టబిబిజూ:/ /జీజూబతీబిఇనీనిశ్రీతినివ.తిని వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు కోరారు. సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని సూచించారు. రౌండ్ ట్రిప్ (రాను, పోను) బుక్ చేసుకుంటే టికెట్ ఛార్జీలపై పది శాతం డిస్కౌంట్ కూడా పొందొచ్చని తెలిపారు. త్వరగా బుక్ చేసుకోండి.. సాధారణ ఛార్జీలతో ప్రయాణించండి అని అధికారులు ట్వీట్ చేశారు. అదేవిధంగా సంక్రాంతికి భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని స్పెషల్ బస్సులు నడిపేందుకు అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఈ స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలు ఉంటాయని చెబుతున్నారు. దసరా పండుగ సమయంలో నడిపిన స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలనే వసూలు చేశారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీకి భారీ ఆదాయం వచ్చింది. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి పండుగకు కూడా అదే స్ట్రాటజీని ఉపయోగించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నారు. ఇక ఏపీలో త్వరలోనే నాన్ ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ బస్సులను స్టార్ లైనర్ పేరుతో నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ బస్సులు 2+1 స్లీపర్ కోచ్, 30 కుషన్ సాఫ్ట్ బెర్త్‌లు ఉంటాయన్నారు. ఇందులో ఛార్జింగ్ పోర్ట్స్, రీడింగ్ లాంప్స్, లగేజీ ర్యాక్స్, ఆడియో కోచ్ సౌకర్యాలు కూడా ఉంటాయి. అయితే ఈ స్టార్ లైన్ బస్సులు ఏయే రూట్లలో ఏ సమయాల్లో నడుస్తాయన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

# నాలుగు వర్గాలే లక్ష్యం

విజయవాడ, డిసెంబర్ 8, తన మనసులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మాత్రమే ఉన్నారని జగన్ అన్నారు. తన వెనక ఉన్నది కూడా ఆ నలుగురేనని ఆయన తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జయహో బీసీ సభలో జగన్ ప్రసంగించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 82 వేల మంది బీసీలు పదవులు పొందారన్నారు. మీ హృదయంలో జగన్.. జగన్ హృదయంలో మీరు ఎప్పటికీ కొనసాగుతారన్నారు. బీసీ లంటే బ్యాక్ వర్డ్ క్లాస్ లు కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని, బీసీలంటే వెనకబడిన కులాలు కాదని, వెన్నుముక లాంటి కులాలని ఆయన అన్నారు. బీసీ అంటేనే పరిశ్రమ అని జగన్ అన్నారు. ప్రతి ఇంటిలో కనిపించేది బీసీల శ్రమ ఫలితమేనని ఆయన అన్నారు.బీసీ అంటే శ్రమ అని, పరిశ్రమ అని ఆయన అన్నారు. ఈ దేశ సంస్కృతికి, సంప్రదాయాలకు చిహ్నం బీసీలని జగన్ అన్నారు. ఆధునిక విద్య బీసీ, ఎస్సీ, ఎస్టీలకు దూరం చేయడం వల్లనే వెనకబాటుకు గురయ్యారన్నారు. తన పాదయాత్రలో ప్రతి ఒక్క కులాన్ని కలుసుకున్న తర్వాత వారి కష్టాలను తెలుసుకున్నానని అన్నారు. బీసీలంటే ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్లు కాదని చంద్రబాబుకు చెప్పాలన్నారు. 114 వాగ్దానాలను ఇచ్చి పదిశాతం కూడా అమలు చేయకుండా చంద్రబాబు 2014లో బీసీలను దగా చేశారన్నారు. ఈ ప్రభుత్వం మాది అని బాబుకు చెప్పమని జగన్ అన్నారు. 139 కులాల పేరుతో 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశామన్నారు. బీసీ కమిషన్ ను శాశ్వత ప్రాతిపదికపైన దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలోనే ఏర్పాటు చేశామన్నారు. అన్ని నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వారే ఎక్కువగా కనిపిస్తున్నారని ఆయన అన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని, తమ ప్రభుత్వంలో నలుగురిని పంపామని చెప్పారు. నామినేషన్ వర్క్ లలోనూ యాభై శాతం రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. బీసీల కోసం ఈ మూడేళ్లలో 1.63 లక్షల కోట్ల రూపాయలు ఖర్చును ఈ ప్రభుత్వం చేసిందని ఆయన గుర్తు చేశారు.చంద్రబాబు నలభై ఏళ్లకు పైగా రాజకీయాల్లోకి వచ్చినా మంచి చేసి ఉంటే వైసీపీపై ఒంటరి పోరాటం చేస్తానని మాత్రం చెప్పడం లేదన్నారు. చంద్రబాబు ఇతరుల మీద ఆధారపడి రాజకీయాలు చేస్తున్నారన్నారు. చేసిందేమిటంటే చెప్పుకునేది ఏమీ లేకపోవడం వల్లనే ఒంటరిగా పోట ? చేసేందుకు భయపడుతున్నారన్నారు. మ్యానిఫేస్టోలో చెప్పిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. వివిధ పథకాల ద్వారా పేద ప్రజలకు నిరంతరం సాయం అందిస్తూనే ఉన్నామని తెలిపారు. ప్రతి గడపకు సామాజిక న్యాయం చేరాలన్నదే తమ ఆకాంక్ష అని జగన్ తెలిపారు. మూడు రాజధానులంటే అనేక రకాలుగా అడ్డుపడుతున్నారని, ఎందుకంటే బాబు మార్క్ సామాజికన్యాయం వేరని జగన్ అన్నారు. చంద్రబాబు నయవంచనను ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి గ్రామానికి వెళ్లి 2024లో కూడా ఇంతకు మించిన గెలుపు ఖాయమని చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లోనూ మారీచులతోనూ, పెత్తందారులతో యుద్ధం చేయాలని చెప్పాలని, 2024 చంద్రబాబుకు చివరి ఎన్నికలు చెప్పాలని జగన్ పిలుపునిచ్చారు.

## నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబరు 9 న జరుపుకుంటారు. దీనిని 2003 అక్టోబరు 31 న ఐక్యరాజ్యసమితి నిర్వహించిన "అవినీతి వ్యతిరేక సదస్సు" ద్వారా నిర్ణయించారు. అవినీతి ప్రభావం అవినీతి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా దిగజారుతాయి. దారిద్ర్యం, వివిధ రంగాల్లో అస్థిరత పెరిగిపోతాయి. అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి, రాజ్య వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలు, ఎన్జీవోలు, మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాల్సి ఉంది. అవినీతి వల్ల మానవ హక్కుల ఉల్లంఘనలు, మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాల నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి. కోర్టుల్లో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, హక్కుల కమిషన్లను ఆశ్రయించడం, ఇంటర్నెట్, టీవీ, ప్రింట్ మీడియాను ఆశ్రయించడం, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరడం వంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకైనా తగ్గించవచ్చు. యాంటీ కరెప్షన్ సంస్థలు ఏర్పాటు చేయడం, రాజకీయ పక్షాలకు నిధులు అందించడం లో, పాలనావ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, ప్రతిభ, సామర్థ్యం లాంటి అంశాల కారణంగా నియామకాలు, ప్రమోషన్లు చేపట్టడం లాంటి చర్యలు తీసుకోవాలని ఈ రంగంలో నిపుణులు సూచిస్తున్నారు. అనుమానాస్పద లావా దేవీలను గుర్తించడం, వివిధ దేశాలు పరస్పరం సహకరించు కోవడం, అన్ని రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం లాంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకు తగ్గించవచ్చు. ఎన్నికల రాజకీయ వ్యవస్థలో అవినీతి తొలగించేందుకు సంస్కరణలు చేపట్టాలి. ప్రతీ కార్యాలయంలో సేవల వివరాలు అవి పొందే విధి విధానాలు ఏ పని ఎన్నిరోజుల్లో చేస్తారో వివరించే ఫిజికల్ చార్టర్‌లు చాలా శాఖల్లో ప్రకటించారు. వీటిని సక్రమంగా అమలుజరిగేలా కార్యాచరణ ఉండాలి.

# బద్వేలులో అవినీతి జలగలు ఎందరో....?

## సాంకేతికత పెరిగిన తగ్గని అవినీతిముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు



బద్వేలు, బద్వేలులో అవినీతి జలగలు లెక్కకు మించి ఉన్నారన్న ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి ముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు పొడుస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు బద్వేలు గోపవరం మండలాల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఇదే పనిగా పెట్టుకున్నారు బద్వేల్ మండలంలో కొందరు విఆర్వోలు వీఆర్ఏలు అవినీతి దందా కొనసాగిస్తున్నారు బద్వేల్ మండలంలో వీఆర్వో ఒక పని చేస్తున్న సుధాకర్ ఈ విషయంలో సిద్ధ హస్తుడని సమాచారం ఆదాయానికి మించి విఆర్ఓ సుధాకర్ ఆస్తులు కూడా పెట్టినట్లు సమాచారం అతని అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయి ఇప్పటికీ అతనిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి గతంలో బద్వేల్ లో నివాసం ఉంటూ కడపలో పనిచేస్తున్న వాణిజ్య పనుల శాఖ ఉప కమిషనర్ అక్రమాస్తులు బట్టబయలు అయ్యాయి ఆ ఘటన మరువక ముందే పంచాయతీ రాజ్ ఏఈ అక్రమాస్తులు కలిగి ఉండి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు అతని నుండి దాదాపు రెండు కోట్ల రూపాయలు విలువ చేసే అక్రమ ఆస్తులు అధికారులు స్వాధీనం చేసుకున్నారు ఆ తర్వాత అతన్ని అరెస్ట్ చేశారు ప్రతి పనికి కమిషన్ ఇస్తేనే సంతకాలు పెడతామని కొందరు అధికారులు పట్టు పడుతున్నారు బద్వేలు పంచాయతీరాజ్ శాఖ లో ఇది మరింత అధికంగా ఉంది ఇలాంటి అధికారులు బద్వేల్ లోని ప్రతి ప్రభుత్వ శాఖలో ఉన్నారు ఏసీబీకి దొరకని అధికారులు ఎంతోమంది ఉన్నారు బద్వేలు సబ్ ట్రెజరీ సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై గతంలో ఏసీబీ అధికారులు పలుమార్లు దాడులు చేశారు సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు ఏసిపి కి పట్టుబడి ఆ తరువాత ఊచలు లెక్కించి ఉద్యోగాలు పోగొట్టుకున్నారు బద్వేల్ లో నివాసముంటు పక్కమండలంలో పనిచేస్తున్న ఒక తాసిల్దార్ ఏసీబీకి పట్టుబడి కొద్దిరోజులపాటు ఊచలు లెక్కించవలసిన దుస్థితి ఏర్పడింది ఆ ఉద్యోగి రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఏసీబీ కేసు అలాగే ఉండిపోయింది నాలుగు సంవత్సరాల క్రితం బద్వేలు ఎక్సైజ్ సి ఐ హిమబిందు బ్రాందీ షాపుల యజమాను నుండి 51 వేల రూపాయలు ముడుపులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు ఆమె నెల రోజులు పాటు కర్నూలు జైల్లో ఖైదీగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది కొద్ది నెలలు గడిచిన తర్వాత కోర్టు ఉత్తర్వుల మేరకు మరో జిల్లాలో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు కాగా బద్వేలు నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు 50000 రూపాయలు ముడుపులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి అంతులేదు ఈ కార్యాలయం పై ఇప్పటికే నాలుగు సార్లు ఏసీబీ అధికారులు దాడులు చేశారు లెక్కలోకి రాని నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు ఇప్పటికీ ఈ కార్యక్రమంలో ముడుపుల గొడవ కొనసాగుతూనే ఉంది ఇక పంచాయతీ రాజ్ కార్యానికి సంబంధించి అవినీతి అంతా ఇంతా కాదు అధికారులు ప్రతి పనికి ఒక ధర నుంచి ముడుపులు దండుకోవడం ఇక్కడ రివాజుగా మారింది కొంతమంది అధికారులు సంవత్సరాలు తరబడి ఇక్కడే తిష్ట వేసి ముడుపులు దండుకుంటున్నారు అడ్డగోలు సంపాదనతో ఆదాయం నుంచి వీరి ఆస్తులు కోట్ల రూపాయలకు పడగలేస్తాయి వీరి ఆస్తులపై అధికారులు విచారణ జరిపిస్తే ఎన్నో విషయాలు వెలుగు చూస్తాయి అంతేగాక కొందరు ఏఈలు ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి ఇస్తారాజ్యంగా సంపాదిస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే ఇదే పద్ధతి బద్వేలు నీటిపారుదల శాఖలోను లేకపోలేదు ఇద్దరు అధికారులు కొంతమంది సిబ్బంది ఇస్తారాజ్యంగా వ్యవహారం నడుపుతూ కోట్లాది రూపాయలు సంపాదించినట్లు సమాచారం ఈ విషయాన్ని ఎవరిని అడిగినా ఇట్లే చెప్పేస్తారు బద్వేలులో కొందరు అవినీతి అధికారులపై వారు సంపాదన పై ఇప్పటికే కొందరు ఏసీబీ అధికారులకు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఆ ఫిర్యాదులపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు సమాచారం అవినీతి లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదేపదే చెబుతుంటే ఆయన సొంత జిల్లాలోనే ముడుపులు కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారు వీరి అవినీతికి ఎప్పుడు చెక్కు పడుతుందో తెలియవలసి ఉంది



# అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి...

## భారత విద్యార్థి ఫెడరేషన్ నంద్యాల జిల్లా కమిటీ




నంద్యాల :-డిసెంబర్ 13,14,15,16 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాదులో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నాడు నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ పీజీ కళాశాలలో విద్యావేత్త రామకృష్ణారెడ్డి గారు మరియు ఎస్ ఎఫ్ ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి నిరంజన్ లు గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉంటుందని భవిష్యత్తులో విద్యారంగం ఎదుర్కోబోతున్న పరిస్థితుల పైన సమీక్షించి విద్యాభివృద్ధికి కృషి చేయడం కోసం ఈ అఖిల భారత మహాసభలు వేదిక కానున్నాయి అని అన్నారు.విద్యా రంగంలో ఒక గొప్ప అభ్యుదయ శక్తిగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ ఎఫ్ ఐ పని. చేస్తుంది అని కొనియాడారు.నేడు దేశంలో ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకం అవుతున్న ప్రమాదం పొంచి ఉంది దానికి కారణం కేంద్ర ప్రభుత్వం విద్యారంగ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తుంది.అందుకే జి.డి.పిలో 6శాతం నిధులు కేటాయించకుండా కేవలం 2శాతం నిధులు కేటయించడం దారుణం అని తెలిపారు. విద్యారంగ్గాని కార్పొరేట్లకు కట్టపెట్టే యత్నం జరుగుతుంది. ముఖ్యంగా విద్యార్థులు మేలుకొని విద్యారంగాన్ని కాపడుకోవాలనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల పట్టణ నాయకులు కిరణ్,మదు,సుమంత్,భార్గవ, లక్ష్మి నారాయణ,శరత్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు - రైతులకు కష్టాలు

## - - అధికారులకు ఆదాయ మార్గాలు



నంద్యాల :- ఏరువాక సాగాలంటే విత్తనాలు. ఎరువులు ఎంతో అవసరం కానీ నంద్యాల పట్టణంలో నకిలీ విత్తనాలతో . కల్తీ ఎరువుల తో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులకేమో అదనంగా ఆదాయం సమ కూరుతుంది . విత్తనాల్ల మోసంతో రైతులు పంట నష్టానికి గురవుతున్నా కంపెనీల పై ఎలాంటి చర్యలు ఉండటం లేదు. నకిలీ విత్తనాల విషయంలో రైతులకు అవగాహన కల్పించడం లో అధికారులు విఫలమయ్యారు . విత్తనాలతో పంటలు సాగు చేసిన రైతులు. దిగుబడులు రాకలబోదిబోమంటున్నారు. అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలానా కంపెనీ విత్తనాలు నాణ్యమైనవని, దిగుబడి అధికంగా వస్తుందని ఒక్కసారి. వాడి చూడాలని దళారులు, కొన్ని కంపెనీల ప్రతినిధులు నమ్మబలకడంతో వారు చెప్పినట్లే వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొని సాగుచేసిన ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు. విత్తనాలు విత్తుకొని కలుపు నివారణ, ఇతరత్రా మందులు వాడినా రావాల్సిన సమయానికి పంట దిగుబడి రావడంలేదంటున్నారు. దీంతో రైతులు ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అన్ని రకాల ఆహార, వాణిజ్య ఇతరత్రా పంటన్నింటిలోనూ నాసిరకం విత్తనాలు రాజ్యమేలుతున్నాయి. నాసిరకం విత్తనాల ప్యాకెట్లు లేబుళ్లను అత్యంత ఆకర్షణగా, అందంగా చూడగానే ఆకట్టు కునేలా డిజైన్ చేస్తూ రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. మార్కెట్లో మంచిపేరు, డిమాండ్ ఉన్న కంపెనీల తరహాలో లేబుళ్లను తయారు చేసి వాటిల్లో నాసిరకం విత్తనాలు ప్యాక్ చేసి రైతులకు అంటగడుతున్నారు. ఇవేమీ తెలియని రైతులు కేవలం లేబుల్, కంపెనీ బ్రాండ్లను చూసి వాటిని కొని సాగుచేసి మోసపోతున్నారు. మార్కెట్లో ఒరిజినల్ కంపెనీలు తమ ఉత్పత్తుల వివరాలు ఆయా కంపెనీల అధికారిక వెబ్ సైట్లలో ప్రదర్శిస్తున్న రైతులు ఏవి అసలు, ఏవి నకిలీవి అన్న విషయం తెలియక ఏటా మోసపోతునే ఉన్నారు. నకిలీ బ్రాండెడ్ ఉత్పత్తులు అగ్రికల్చర్ ఎఓ అధికారులకు తెలిసిన రైతులను అప్రమత్తం చేయడంలో వారు మీన మేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రైతులు నష్టపోవడానికి కొందరు అధికారుల తీరు కూడా కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. నాసిరకం విత్తనాలు మార్కెట్లోకి వదిలే వ్యక్తులు, సంస్థలు తమ వ్యాపారానికి, ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా కొందరు అధికారులను మచ్చికచేసుకొని వారికి లబ్ధి చేకూరుస్తూ లక్షలాది రూపాయలు సంపాదింస్తున్నారు. ఈ మధ్య కాలంలో రైతులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుకుంటున్నారు


# ఐఎండీబీ టాప్–10 లో చరణ్..తారక్..సమంత!

ప్రతీ ఏడాది ప్రఖ్యాత వెబ్ సైట్ ఐఎండీబీ టాప్ –10 సెలబ్రిటీల జాబితాని అనవాయితీగా ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా అత్యధిక పాపులారిటీని..క్రేజ్ని ఆధారంగా చేసుకుని ఈ జాబితాని వెల్లడిస్తుంది. తాజాగా 2022 ఏడాదికి సంబంధించిన సెలబ్రిటీల జాబితాని ప్రకటించింది. ఇందులో తెలుగు హీరోలు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్..యంగ్ టైగర్ ఎన్టీఆర్.స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్.. కన్నడ నటుడు యశ్... హీరోయిన్ సమంత..కియారా అద్వాణీ స్థానాలు దక్కించుకున్నారు.ర్యాకింగ్స్ లో చరణ్ నాల్గవ స్థానంలో ఉండగా... సమంత ఐదవ స్థానంలో...టైగర్ 8వ స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే బన్నీ తొమ్మిదవ స్థానంలో ఉన్నారు. కేజీఎఫ్ తో ఇండియాని షేక్ చేసిన యశ్ 10వ స్థానంలో ఉన్నారు. ఇక మొదటి స్థానంలో కోలీవుడ్ హీరో ధనుష్ దక్కించుకోగా..రెండవ స్థానంలో అలియా భట్ ఉంది. ధనుష్ ఇదే ఏడాది హాలీవుడ్ లోకూడా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.ఇండియా నుంచి హాలీవుడ్ లో నటించిన స్టార్ కావడంతో ఐఎండీబీ ధనుష్ కి అగ్రతాంబూలం ఇచ్చింది. ఇక బాలీవుడ్ హిట్లు కోసం పాకులాడుతోన్న సయంలో 'గంగూబాయి కతియావాడి' లాంటి విజయంతో ఇండస్ట్రీ పరువు నిలబెట్టిన అలియాకి సెకెండ్ ప్లేస్ కల్పించారు. ఇక చరణ్...ఎన్టీఆర్ ఆర్ ఆర్ ఆర్ తో ఇండియా సహ హాలీవుడ్ ని షేక్ చేసిన సంగతి తెలిసిందే.1100 కోట్ల వసూళ్లతో భారత్ లో మూడవ భారీ వసూళ్ల చిత్రంగా నిలిచింది.అలాగే చరణ్ కి హాలీవుడ్ అవకాశాల కూడా వచ్చాయి. ఎన్టీఆర్ కారణంగా సినిమా ఆస్కార్ కి రీచ్ అయింది. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' తో పాన్ ఇండియాలో భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా హిందీ బాక్సాఫీస్ ని వసూళ్లతో షేక్ చేసింది. ఇలా కొన్ని లెక్కలతో ఐఎండీబీ తెలుగు హీరోలకు తమ జాబితాలో స్థానం కల్పించింది.అయితే ఇందులో ప్రభాస్ లేదు. దీంతో అభిమానులు కాస్త ఫీలవుతున్నారు. 'బాహుబలి'తో ఫేమస్ అయిన అటుపై చేసిన సాహో...రాధేశ్యామ్ లాంటి సినిమాల వైఫల్యంతో దెబ్బ పడింది. అలాగే పొన్నియన్ సెల్వన్ తో ఫామ్ లోకి వచ్చిన ఐశ్వర్యా రాయ్ బచ్చన్ కి3వ స్థానం దక్కడం విశేషం. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఐష్ ఈసినిమా తో భారీ సక్సెస్ అందుకుని రేసులో నిలిచింది. అలాగే ఈ జాబితాలో కియారా అద్వాణీకి కూడా చోటు దక్కింది. ఈ ఏడాది అమ్మడు బాలీవుడ్ లో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకున్న సంగతి తెలిసిందే. అలాగే శంకర్ దర్శకత్వంలో ఆర్ సీ 15 లోనూ ఛాన్స్ అందుకుని ఫేమస్ అయింది.




# తొడకొట్టాడోయ్ తెలుగోడు.. పవన్ వీరమల్లు లుక్ పై ఫ్యాన్స్ సూపర్ హ్యాపీ..!

తన ప్రతి సినిమాతో ట్రెండ్ సెట్ చేసే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం క్రిష్ డైరెక్షన్ లో హరి హర వీరమల్లు మూవీ చేస్తున్నాడు. పవన్ రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఈ మూవీ చారిత్రక కథతో వస్తున్నాడు. సినిమాలో పవన్ ఒక గజ దొంగ గా కనిపిస్తారని తెలుస్తుంది. ఇప్పటికే ప్రచార చిత్రాలు మూవీ పై భారీ అంచనాలు ఏర్పరచాయి. ఇక లేటెస్ట్ గా పవన్ వీరమల్లు లుక్ తో మరోసారి సర్ ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుపుకుంటుంది. సెట్స్ లో ఉండగా పవన్ వీరమల్లు స్టిల్ ఒకటి బయటకు లీక్ అయ్యింది.రెడ్ కలర్ డ్రెస్ లో లైట్ గడ్డంతో పవర్ స్టార్ లుక్ అదిరిపోయింది. ఈ సినిమాతో పవన్ రేంజ్ పాన్ ఇండియా లెవల్లో తెలిసేలా చేస్తున్నాడు క్రిష్. హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ అనుకున్న విధంగా స్పీడ్ గా జరగకపోయినా పవన్ ఈ లుక్ చూసి పవర్ స్టార్ ఫ్యాన్స్ మాత్రం సూపర్ హ్యాపీగా ఉన్నారు.సినిమా లేట్ అయినా పర్లేదు కానీ మా హీరో కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అందించు చాలు అంటూ క్రిష్ కి పవర్ స్టార్ ఫ్యాన్స్ మెసేజ్ లు చేస్తున్నారు. క్రిష్ సినిమా అంటే కాన్సెప్ట్ ఓరియెంటెడ్ గా మినిమం గ్యారెంటీ హిట్ అన్నట్టు ఉంటుంది.ఇక అక్కడ ఉంది పవన్ కళ్యాణ్ కాబట్టి యావరేజ్ గా ఉన్నా ఫ్యాన్స్ హిట్ చేస్తారు. వీరమల్లు మూవీ పవర్ స్టార్ కెరీర్ లోనే ప్రత్యేకమైన సినిమా.. ఇలాంటి పాత్రల్లో పవన్ ని ఎప్పుడూ కూడా ఫ్యాన్స్ చూడలేదు. ఈమధ్యనే వచ్చిన టీజర్ లో తొడకొట్టాడోయ్ తెలుగోడు అంటూ ఫస్ట్ టైం పవన్ చేత కూడా తొడకొట్టించి గూస్ బంప్స్ వచ్చేలా చేశాడు క్రిష్. సినిమాలో అలాంటి సీన్స్ ఇంకా చాలా ఉన్నాయని తెలుస్తుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షెడ్యూల్ తో దాదాపు మేజర్ పార్ట్ అంతా పూర్తి అవుతుందట.అసలైతే 2023 సంక్రాంతికి రిలీజ్ అనుకున్న హరి హర వీరమల్లు మూవీ పొంగల్ రేసు నుంచి డ్రాప్ అయ్యి సమ్మర్ కి షిఫ్ట్ అయ్యింది. అయితే సమ్మర్ కైనా సినిమా వస్తుందా లేదా అన్నది చూడాలి. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న వీరమల్లు సినిమాకు కీరవాణి మ్యూజిక్ అందిస్తుండగా సాయి మాధవ్ బుర్ర డైలాగ్స్ అందిస్తున్నారు.



# రెండో వారం అవతార్ 2కి వదిలేశారా..!

ఇండియన్ బాక్సాఫీస్ పై అవతార్ 2 విజృంభించడానికి సిద్ధమైంది. అవతార్ 1 తోనే ఇక్కడ ఎన్నో రికార్డులు సృష్టించిన ఈ మూవీ ఇప్పుడు ఆ సినిమా సెకండ్ పార్ట్ తో సత్తా చాటాలని చూస్తుంది. డిసెంబర్ 16న వరల్డ్ వైడ్ గా భారీ రేంజ్ లో రిలీజ్ అవుతున్న ఈ మూవీకి అన్నిచోట్ల భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.అంతేకాదు ఈ సినిమాకు పోటీగా వస్తే డేంజర్ అనుకుని మరే సినిమా రిలీజ్ చేయట్లేదు. డిసెంబర్ 16 కి ముందు వారం అంటే డిసెంబర్ 9న దాదాపు 17 సినిమాల దాకా రిలీజ్ అవుతున్నాయి. ఇక నెక్స్ట్ వీక్ మాత్రం శాసనసభ పసివాడి ప్రాణం సినిమాలు మాత్రమే రిలీజ్ అవుతున్నాయి.ఇండియన్ మార్కెట్ ముఖ్యంగా టాలీవుడ్ పై అవతార్ 2 ప్రభావం భారీగానే ఉండబోతుంది. జేమ్స్ కామెరూన్ మీద ఉన్న నమ్మకం వెండితెర మీద అవతార్ 2 మరో అద్భుతాన్ని సృష్టిస్తుందని ఫిక్స్ అయ్యారు. అందుకే డిసెంబర్ సెకండ్ వీక్ ని ఆ మూవీ కోసం వదిలి పెట్టారు. ఇక 10 రోజుల ముందే టికెట్స్ ఓపెన్ కాగా రిలీజ్ దగ్గర పడుతున్న టైం లో టికెట్స్ సేల్ పెరుగుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఏరియాలో అవతార్ 2 భారీ రేంజ్ లో రిలీజ్ అవుతుంది. అందుకే నెక్స్ట్ వీక్ సిటీ మొత్తం అవతార్ 2 షోలతోనే నిండిపోతుంది.రీసెంట్ గా వచ్చిన హిట్ 2 ఎలాగు అప్పటికల్లా ఫుల్ రన్ పూర్తి చేసుకుంటుంది. ఇక ఈ శుక్రవారం రిలీజ్ అవుతున్న ఏ సినిమా కూడా వారం కంటే ఎక్కువ థియేటర్ లో ఉండే ఛాన్స్ కనిపించడం లేదు. కాబట్టి డిసెంబర్ 16న వస్తున్న అవతార్ 2 తెలుగు రాష్ట్రాల్లో కూడా సంచలనాలు సృష్టించే ఛాన్స్ ఉంది. అవతార్ 2 తో పాటుగా మీడియం రేంజ్ హీరోల సినిమాలు వస్తే నిలబడే ఛాన్స్ ఉండేది. ఎందుకంటే అవతార్ 2 అందరు చూసే సినిమా ఏమి కాదు ముఖ్యంగా మాస్ ఆడియన్స్ ఈ సినిమాని ఇష్టపడకపోవచ్చు. మరి అలాంటి వారి కోసమైనా అవతార్ 2 డేట్ న మన హీరోలు ఏదైనా సినిమా వదిలితే బాగుండేది.డిసెంబర్ చివరి వారం అంటే 23న నిఖిల్ 18 పేజెస్ రవితేజ ధమాకా రిలీజ్ చేస్తున్నారు. ఆ రెండు సినిమాల్లో ఏ ఒక్కటైనా అవతార్ 2 కి పోటీగా రిలీజ్ చేసినా వర్క్ అవుట్ అయ్యేదని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. మరి సింగిల్ గా వస్తున్న అవతార్ 2 ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో ఏ రేంజ్ లో చూపిస్తుంది అన్నది చూడాలి.



# మీ ఇంటిలో సానుకూల నెలకొనాలంటే, ఈ వాస్తు చిట్కాలను పాటించండి !

ప్రపంచవ్యాప్తంగా అనేక మతాలవారు, సంస్కృతులవారు వాస్తుశాస్త్రమును అనుసరిస్తున్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణంలో నెలకొని ఉన్న అనేక శక్తులను ఒకే విధంగా సంతుల్యం చేసే అతిపురాతన సాంప్రదాయ పద్ధతుల్లో వాస్తుశాస్త్రము ఒకటి. ఇదిఇలా మానవులు చేపట్టే నిర్మాణాల ద్వారా మాత్రమే జరుగుతుంది. భవన స్వరూపము (లేదా) భవన నిర్మాణము, ఏ దిశ నుంచి మంచి శక్తిని పొందాలో ఒ ఏ దిశలో మంచి శక్తి ప్రసరింపబడుతుందో అనే విషయాన్ని సూచిస్తుంది.నివాసముకు ఆవాసయోగ్యమైన భవనం (లేదా) నిర్మాణంలో ఉన్న భవనం దాని చుట్టూ ఉన్న అనేక శక్తులను ప్రభావితం చేస్తుంది.మనము నివాసముంటున్న భవనము చుట్టుపక్కల వాతావరణంలో వెలువడే శక్తులు మాత్రమే మన మానసిక పరిస్థితులను ప్రభావితం చేస్తుంది. ఈ మానసిక పరిస్థితులే మన మనసును, మన పనిని ప్రభావితం చేస్తాయి.అందువలన, సానుకూల శక్తి మాత్రమే మన చుట్టూ ప్రవహిస్తుందని నిర్ధారించబడేలా, ఇంటి నిర్మాణం సమయంలో మనము కొన్ని వాస్తు చిట్కాలను పాటించాలని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.ఇల్లు లోపల ఉండే వంటగది చాలా ముఖ్యమైనది. ఆహారం ప్రాథమిక అవసరంగా ఉండటం వలన, మనము తినే ఆహారం సానుకూల వికిరణాల (శక్తుల) ను కలిగి ఉండాలి.మీ వంటగదిని నిర్మించేటప్పుడు మీరు తప్పక గుర్తుపెట్టుకోవలసిన కొన్ని విషయాల జాబితా ఇక్కడ ఉంది. అవేమిటో ఒకసారి మీరే చూడండి.1. కిచెన్ నిర్మాణ శైలి :1. కిచెన్ నిర్మాణ శైలి :సానుకూల శక్తి ప్రవాహాన్ని నిర్ధారించడానికి వంటగది ఎల్లప్పుడూ సౌత్ ఈస్ట్ దిశలో నిర్మించబడాలి. ఈశాన్య దిశలో ఉంటే, ఇది ప్రతికూల శక్తులను ప్రసరించే అవకాశాన్ని కలిగించవచ్చు. అలా కాకుండా మీ వంటగది నైరుతి ప్రాంతంలో ఉంటే, అది కుటుంబ సభ్యుల మధ్య కలహాలు ఒ అభిప్రాయ భేదాలను కలిగిస్తుంది. వాయవ్య దిశలో ఉండే వంటగది చాలా వ్యయాలకు ఒక కారణం అవుతుంది.2. కిచెన్ పైన (లేదా) దిగువున రూములు ఉండటం :2. కిచెన్ పైన (లేదా) దిగువున రూములు ఉండటం :వంటగది ఎప్పుడు కూడా పైన ఉండకూడదు.3. గోడల రంగు :. గోడల రంగు :వంటగది గోడలకు బ్లాక్ రంగును వాడకూడదు. మీరు పసుపు, నారింజ, గులాబీ, చాక్లెట్ (లేదా) ఎరుపు రంగులను ఉపయోగించవచ్చు.4. ఏ దిక్కున వంట చేయాలి :4. ఏ దిక్కున వంట చేయాలి :దక్షిణ దిశవైపుగా వంటలను చేయకూడదు. ఇది ద్రవ్యపరమైన నష్టాలకు దారి తీస్తుంది. పశ్చిమ దిశవైపుగా వంట చేసేవారు కుటుంబానికి చెందిన ఇతర సభ్యులకు ఆరోగ్య సమస్యలను కలిగజేస్తుంది. తూర్పు దిశలో మాత్రమే ఎప్పుడూ వంట చేయాలి.5. కిచెన్ డోర్ :5. కిచెన్ డోర్ :వంటగది తలుపులు ఉత్తరం, తూర్పు (లేదా) పడమర దిశల వైపున ఉండాలి. అలా అని ఇది మూలల్లో ఉండకూడదు.. రిఫ్రిజిరేటర్ ఉంచడం6. రిఫ్రిజిరేటర్ ఉంచడం :రిఫ్రిజిరేటర్ ఈశాన్య దిశలో ఉంచరాదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**